ప్రేమతత్వం

శ్రీమతి చామర్తి సీతాదేవిగారు

"ఏమండీ! మీకు కచేరీ వారంరోజులు శలవులు వస్తున్నాయట? ఆశలవులలో రాజమండ్రీ వెళదామండీ!" అంది సీతమ్మ.

సీతమ్మ కాపురానికివచ్చి మూడేళ్ళయింది. ఆమె మంచి ప్రౌఢ; లోకజ్ఞానం విశేషంగా సంపాదించింది. కావ్యాలు కొంతవరకూ చదువుతుంది. వీరభద్రరావు బి. ఏ. పరీక్షలో కృతార్థుడయ్యేడు. మునసబుపని సంపాదిద్దామని, లిస్టులో పేరు వేయించుకుందామని యీ మధ్యనే చెన్నపట్నం వెళ్ళివచ్చేడు. అక్కడ నుండి వచ్చినప్పటినుండి యేవో పుస్తకాలు చదువుతున్నాడు. ఆలోచనలో మునిగిపోయినట్టుంటున్నాడు. సీతమ్మ అసంగతికని పెట్టిందిగాని కారణం వూహించలేక పోయింది. తాను మూడేళ్ళాయె కాపురానికి వచ్చిందిగాని ముచ్చట తీరడాని కొక మొలకయినా కలిగిందికాదని ఆమెనొచ్చుకొనేది. వీరభద్రరావుకు కూడ అదే విచారం అనుకుంది. రాజమండ్రి వెళితే సన్యాసయ్య తప్పకుండ పుడతాడని ఆమె నమ్మకం. అందుకోసం భర్త నడిగింది. అత డిటీవల చదువుతూవున్న పుస్తకాలూ, పెద్దపెద్దవాళ్ళు చెపుతూవున్న ఉపన్యాసాలూ, కొందరు మహనీయులు చేస్తూన్న ఉపదేశాలూ ఇవన్నీ కలసి వీరభద్రరావు మతం మార్చేశాయి.

"పోనిస్తూ! ఏం రాజమండ్రీ! నీకే పిల్లలపిచ్చి పట్టుకుందేం? చక్కగా కడిగిన ముత్యాల్లాగ మనమిద్దరమూ కలసి మెలసి కాలక్షేపం చేయుకుందా! ఆ లంపటంకూడా యెందుకు కోరుతావు?" అన్నాడు వీరభద్రరావు. సీతమ్మ కళ్లు విశాలంగా విప్పి భర్త నెగాదిగా చూచింది. ఆశ్చర్యదేవతయి అలా నిలబడి పోయింది. "అయితే వంశాభివృద్ధి జరుగుదు లేదంటారా యేమిటి?" అంది.

వీరభద్రరావు "జరుగుతేగాని, మనకింత వేగం పిల్లలక్కరలేదు. వంశాభివృద్ధికి కావలిస్తే ముందెప్పుడో ఒక మొలకని కంటావు! అదే మానయి ప్రవర్తిల్లుతుంది. చాలదూ?" అన్నాడు.

సీతమ్మ:— ముందెప్పుడో అంటే యెప్పుడు? మన యౌవనం కాస్తా జారిపోయిన తరువాతా?

వీరభద్రరావు:— ఉండుమరి! లోపపడకు! ఇవిగో యీ పుస్తకాలు చూచేవా? మొన్న చెన్నపట్నం వెళ్లినప్పుడు నాకో హైకోర్టు జడ్జీగారిచ్చేరు. వాట్లలో యేం వ్రాసివుందంటే, ఏ దంపతులయినా సరే కోరినప్పుడు మగో ఆడో, వారికేపిల్ల కావలిస్తే ఆ పిల్లని కనవచ్చును. వారికి పిల్లలక్కరలేదనితోస్తే కనడం మానివేయవచ్చును. నీవు పిల్లలను కనివుంటే నీకు నామీదనున్న ప్రేమ మూడువంతులు లా పిల్లల మీదికి పోతుందా? అప్పుడు నేను ముచ్చటపడి పిలిస్తే నీకు పలకడానికయినా తీరుబాటుంటుందా? ఇంతలోనే మనం ముసలాళ్లమయిపోతే యేముందీ? భగవంతుడు ప్రసాదించినన్నినాళ్లయినా మనము యౌవనసౌఖ్య మనుభవించాలా? అది అలావుండగా పిల్లలెక్కువయినకొద్దీ మనఆస్తి పలుచపడిపోతుంది. వాళ్ళకి కావలసినవన్నీ యిచ్చి జీవనవిధానా లేర్పాటు చెయ్యడానికి మన కప్పు డవకాశముండదు. మన పిల్లలు పేదవాళ్లయి తిరుగుతూఉంటే మనకానందంగా ఉంటుందా!

సీతమ్మ కనుబొమ్మలు ముడేసింది. తీక్ష్ణంగా

భర్తవైపు చూచి అంది. "మునసబుపని కనకనా, హైకోర్టు జడ్జీ యివ్వాలా? ముచ్చటలు వద్దనడానికి హైకోర్టుజడ్జీకావాలీ? యీ ప్రకృతిని మార్చగల కావ్యాలుకూడా వస్తున్నాయా? పిల్లలను కంటే ఆడుదాని యౌవనం జారిపోతుందని మగవాడికి భయమా? ఆహా! యేమి విశాలహృదయం! మగవాని ఆయుర్భాగ్యం వానిచేతిలో నున్నదా? అదిగాక, యౌవనానుభవాకాంక్ష యెంత కాలముంటుందో నిర్ణయించాడా? పిల్లలులేని నావంటి నిర్భాగ్యురాళ్లు త్రిదశులయి దేదీప్యమానంగా వెలిగిపోతున్నారా? శాశ్వతయౌవన సౌఖ్యమనుభవిస్తున్నారా? తాను నిత్యయౌవనుడై నిర్మలంగా విద్ద పూవులాగు కలకలలాడుతూ ఉంటాడా? నిష్కల్మష ప్రేమకే యౌవన మెక్కడే లక్ష్యమా? వానప్రస్థులయిన దంపతుల కే యౌవనం ఉంది? వారు ఒకరినొకరు ప్రేమించుకోలేరా? వలపు కేవలము పశుత్వం క్రింద పరిణమిస్తుందేం? ఇంత స్వార్థపరత మగవానికే గాని యాడుదానికక్కరలేదూ? ఇట్లు నిత్యపశుత్వపరత్వమున బడే మగవాని యౌవనం మరి జారదు గాబోలు. ఇంకొకమాట—మగవానికంటి కాడుదేలా కనబడుతుంది? వాసన చూచి పారేసే పువ్వను కున్నాడా?

"అదిగాక; పిల్లలు పుట్టడంతోనే ఆడుదానికి మగవానిమీది ప్రేమ పిల్లలమీదికి పోతుందా? ఈ నవీన ప్రేమతత్వసూత్రం నాకు బోధపడలేదు. అయితే జగత్తులో ఆడుదానికి మగవాడుతప్ప మరి ప్రేమింపదగిన వస్తువే లేదన్నమాట. భగవంతునిమీది ప్రేమ పరగడలు త్రొక్కవలసిందే? తలిదండ్రులమీది ప్రేమ తారుమారు కావలసిందే? అన్నదమ్ములమీది ప్రేమ అడుగంటవలసిందే? స్నేహితులమీది ప్రేమ చిందరవందర కావలసిందే? బంధువులపైని ప్రేమ పాడు కావలసిందే? దేశప్రేమ దిబ్బచేరవలసిందే? అదేనా ప్రేమతత్వం?

"ఇంక పిల్లలెక్కువయితే ఆస్తి పలుచబడుతుందన్నారు. ఇది మగవాని అర్థశాస్త్ర జ్ఞానసౌభాగ్యం కాబోలు! ఆస్తిని శాశ్వతంగా నిలబెట్టే ఉపాయాలెన్ని కనిపెట్టేరు? శ్రీమంతు లెందరిచేతికో చిప్ప వచ్చింది. అక్కడల్లా బిడ్డలసంఖ్య కారణమా? మీరన్నట్టు కావలసినట్టొక్క కొడుకును గన్నారనుకోండి? ఆ కొడుకు మొద్దయితేనో? చపలుడయితేనో? చచ్చు పెద్దమ్మయితేనో? ఎందరు పండితుల కడుపున శుంఠలు పుట్టలేదు? పండితపుత్రుడన్నమాట వినలేదూ? ఇక ఆరోగ్యవిషయ మాలోచించండి. పిల్లలను పెంచే విధానము లెరిగిన దంపతు లెందరున్నారో లెక్కపెట్టండి. అలాగే పెంచుతున్నారనుకొందాం; అంటువ్యాధులు రాకుండ నిలబెట్టే ఉపాయాలు స్థిరమైన వేవయినా ఉన్నాయా? రోగాలను తిడితే గ్రుద్దినట్టు పనిచేసే మందులున్నాయా? అవేవీ లేనప్పుడొక్క మొలకను కనిపెట్టుకున్న తలిదండ్రుల దినం యెలా దెబ్బతేరుతుంది? మగవాడన్నవాడు, జీవుడిని నిత్యం వెన్నంటిఉండే మృత్యుదేవతను దూరంగా తరిమే స్థిరోపాయం కనిపెట్టాలి. పాదరసంలాగు పరుగత్తే తనమనస్సు వ్యసనసంసక్తంగాకుండా మరలిచే ఉపాయాలు కనిపెట్టాలి. దుర్వ్యాపారాలలో తలదూర్చకుండా ఉండే కట్టుబాట్లు చేసుకోవాలి. అప్పుడు జననతత్వంమీద స్వతంత్రత సంపాదిస్తే రాణిస్తుంది!"

వీరభద్రరావు:—అబ్బ! ఏమిటలా గచ్చపొదలాగ గలగలలాడుతున్నావు? జణజణలాడించేశావే! నేను చెప్పిన మాటలు నీవర్థం చేసుకోలేకపోయావు. ఈమాటు స్పష్టంగా చెపతానువిను. పిల్లలను కంటే ఆడుదాని బలం క్రమక్రమంగా తగ్గిపోతుంది. అందుకోసం మితిమీరకుండా ఒకడో ఇద్దరో పిల్లలను కని కాన్పుత్తివేయగలిగితే స్త్రీ ఆరోగ్యం అంతగాచెడదు. దేహసౌఖ్యం యెప్పుడైతే వుందో గేహసౌఖ్యం అప్పుడే ఉంది.

సీతమ్మ:—అలాగయితే నేను మాటాడలేనుగాని బుద్ధిమంతులు లోకానికి తమచేతలచేత, మాటల చేతాకూడ తెలియాలి: కేవలం యితరుల ఊహాలమీద పండితులబుద్ధి వన్నె కెక్కకూడదు. ఒక్కొగెల వేసి యరటిచెట్టు తెరిస్తూంది. ఒక పిల్లను చేసి తుమ్మెద తొలిగిపోతూంది. ఇది ప్రకృతి నిర్మాణతత్వమా? చిత్రకారుని శిల్పచాతుర్యమా? ఇంక యెన్నియో జంతువులు ఒక్కొక్కతూరి నాలుగయిదు కూనలను పెట్టి నిత్యారోగ్యముతో నిగనిగలాడుతున్నాయి. ఇది ప్రకృతి తత్వమా? ప్రకృతి శాస్త్రవేత్త భావపరిణామమా? ప్రకృతిలో భాగమయిన మనుష్యజాతికి ప్రకృతి సూత్రములంటవా? ఈ సందర్భములో నాకో చిన్నకథ జ్ఞాపకం వచ్చింది. చెప్తామవినండి. నేను పదేండ్లదాన్నై యున్నపుడు మా అన్న రఘురామరావు కోయంబత్తూరినుండి శలవు లేవో వస్తే యింటికొచ్చాడు. మా నాన్న మా పెరట్లో గులాబి మొక్కొకటి వేశాడు. అప్పుడది సోగకొమ్మ వేసి కొమ్మకొమ్మకూ గుత్తులుగుత్తులు మొగ్గలు తొడిగింది. రఘురామరావప్పుడు వ్యవసాయ కళాశాలలో చదువుతున్నాడు. అతడీ చెట్టుచూచి, చెల్లీ! చీడ పురుగులలాగ చెట్టుకిన్ని మొగ్గలెందుకే! చెట్టుసత్తువ చెడుతుంది. పువ్వందం పోతుంది. చూడు కొమ్మంతటికీ ఒక్కటే పువ్వు పూయిస్తాను. అప్పుడానందించూ దన్నాడు. సరే అలాగే కానీ అన్నాను. అతడు కత్తెరొకటి పట్టుకొని చుట్టూఉన్న మొగ్గలన్నీ కత్తిరించేసి మధ్యనున్న మొగ్గమాత్రం కొమ్మను విడిచేశాడు. ఆ మొగ్గ క్రమ క్రమంగా పెరిగి పెద్దదయి కొమ్మ నిండా ఒక్కటేపువ్వు విడ్డాది. పువ్వు మరీ సొగసుగా వుంది. పెద్దది! దానినికోసి యెప్పటివాడుక చొప్పున వాసన చూచాను. ఏం చెప్పేది! దాని మునుపటి పరిమళమంతా పోయింది. నేను తెల్లబోయేను. వెగటు వాసన వేసింది గాని గులాబివాసన లేనేలేదు! ఎందుకా పువ్వు! ఆ లల్లిమీద జిలుగు రెండుపూ లేలాగుందో చూడండి! దానికీ దీనికీ యేమిటిభేదం? ఇంకా యీ రెండుపువ్వే నయం! ఈ మధ్య బెంగుళూరునుండి వచ్చిందని పెద్ద చేమంతిపువ్వు మీరు తెచ్చేరే, అది కాగితపు పువ్వులాగు కలకలలాడడమే గాని కొంచమేనా పరిమళించిందండీ? ఎందుకీ నిర్గంధ కుసుమాలు? ఎక్కడయితే ప్రకృతి విరుద్ధంగా శరీర నిర్మాణ తత్వం మారుతుందో, అక్కడల్లా గుణం కొరతపడుతుంది.

వీరభద్రరావు:—ఉండయుంతే! దీనికేం చెప్తావు? మంచి చెడ్డ లాలోచించకుండా ఎక్కువ మందిని కనేస్తూంది లోకం! ఈ పిల్లలతో కాలేజీలు కర్మాగారాలు క్రిక్కిరిసి పోతున్నాయి! కళాప్రవీణు లెక్కువయిపోతున్నారు. నిరుద్యోగపు సమస్య లెక్కువయిపోతున్నాయి. అభిప్రాయభేదాలకు మాద్దేలేదు. బ్రాహ్మణ బ్రాహ్మణేతర భేదాలు బలిసి పోతున్నాయి. ఇవన్నీ తగ్గి దేశమంతా ఏకముఖంగా పనిచేయాలంటే జనసంఖ్య తగ్గాలి; గాంధిమహాత్ముడు కూడ యీ మాటే అంటాడు. కాని అతని విధానం వేరు. స్త్రీ పురుష సంయోగాని కవకాశమే యివ్వ కూడదంటాడు. ఈ గ్రంథాలలో స్త్రీ పురుషులు భార్యాభర్తలుగా జీవిస్తూ కొన్నికొన్ని యంత్ర సాధనాలవల్ల సంతానవంతులు కాకుండా ఉండ వచ్చునని నూతన సిద్ధాంతం చెప్పబడివుంది.

సీతమ్మ:—అబ్బ! ఆమాటలువినడమే కష్టంగా ఉంది! ఏమిటిది? పిల్లలులేకపోతే కాలేజీలెందుకు, కర్మాగారాలెందుకు? జగత్తులో అభిప్రాయభేదమే లేకపోతే జగత్తే లేదు. చూచేరా, ఆ బుద్ధిమంతుల లోనే రెండుతెగ లేర్పడ్డాయి. గాంధిమహాత్ముని దొకత్రోవా, గ్రంథకారుల దొకత్రోవా—మనుష్యున కున్న ప్రత్యేకతయే యభిప్రాయభేదము; అభిప్రాయ భేదమువలననే ప్రజలలో విద్యాకాంక్ష; దానివలననే జ్ఞానాభివృద్ధి; అదియే దేశక్షేమాభివృద్ధికి కారణమవు తూంది. సృష్టితత్వం ఒకమాటు నిదానించి చూడండి! జనులముఖా లెన్నో అన్ని భేదాలు, మన స్తత్వాలెన్నో

673

అన్ని భేదాలు! శరీరనిర్మాణములలో న్నీ అన్ని భేదాలు! జనసంఖ్యతగ్గితే సామ్యమేర్పడుతుందా?

"ఈ మహాకార్యానికి యంత్రసాధనం కూడా కనిపెట్టేరూ? ఇది మరీ బాగుంది. యంత్రసాధన సంపత్తి యెప్పుడింత లావయింది? గొడ్రాలికి బిడ్డలను ప్రసాదించే యంత్రాలున్నాయా? ఇక్కడ మీ యాటలు సాగవుగదా! పొరుగువాళ్ల మా లక్ష్మి నాతోటిదే, ఇద్దరు పిల్లలనుకంది; ముద్దుముచ్చటా చక్కా అనుభవిస్తూంది. నాకేదీ? ఇన్నాళ్ళయినా కూడదూ?"

"అది కాదే" అని వీరభద్రరావు యేదో చెప్ప బోయేడు.

"ఏది కాదూ! మరింక యీ బూకువు రాణం కట్టెయ్యండి సరే, మీయంత్రాలేకో మీరుపయోగించండి. దైవంలేదా? ప్రకృతి సమత్వతత్వ మూత్రా లెరుగదా? మీతో నా కెందుకీవాదం? నే నవతలకు పోయి వండుకోవాలి" అని సీతమ్మ లోపలికి వెళ్ళిపోయింది. వీరభద్రరావు చిరునవ్వునవ్వుతూ అలా కుర్చీలో కూర్చున్నాడు.

౨

"జానకీ? ఏం చేస్తున్నావు? ఇదిగో మంచివస్తువు తెచ్చేను నీకోసం" అని వీరభద్రరావు కేక పెట్టాడు. సీతమ్మ పెరట్లో అశ్వత్థప్రదక్షిణాలు చేస్తూంది. "ఏమే? రావేం? నీకు కావాలా అక్కరలేదా?— రా మరీ ఆ రావిచెట్టెక్కడికి పోతుంది?" అన్నాడు వీరభద్రరావు.

సీతమ్మ గబగబా వచ్చింది. "ఏమిటాబంగీ" అంది.

వీరభద్రరావు:—బంగీ విప్పుతాను చూడు!

సీతమ్మ:—(దగ్గరగావెళ్ళి చూచి) "ఏమిటిదీ? పిల్లలులేని నాలాటి గొడ్రాలికి ఉగ్గుగిన్నెందుకూ? పిల్లలులేని చిన్నతనం నాకొక్కర్తికేనా యేమిటి? మీకుమాత్రం చిన్నతనంలేదూ?"

వీరభద్రరావు:—ఇదేమిటోయ్ సరీగాచూచి చెబ్బ లాడు! ఇది స్త్రీలపాలిటి వరప్రసాదిని! స్త్రీల యౌవనధనాగారం! మంగాంగుబంగారం! ఆ కంపెనీ వాళ్లు చెప్పినట్లూ మనం చేయగలిగేమంటే ఇక భార్యా భర్తల నడుమ శాశ్వతానురాగం స్థాపించే మన్నమాటే? ఇక వారిమధ్య పానకంలో పుడకలాగు బిడ్డలుండరు.

సీతమ్మ:—సరే! రోజురోజుకీ మీకు పిచ్చి లావవుతుంటేం? మీదదేవుణ్ణి క్రిందను పెట్టినయినా ఆడుది పిల్లలను కనితీరుతుంది." అని వెళ్ళిపోయినది.

ఆరునెలలయింది, మునుపటికంటె వీరభద్రరావుకు సీతమ్మమీద ప్రేమ లావయింది. ఆమె చెక్కుల తెలుపూ, పెదవిపైని జాలిరేఖలూ, కనురెప్పల బరువూ, అడుగు మెల్లనా, అతిసుకుమారం, ఇవన్నీ సీతమ్మ సహజసౌందర్యానికి వన్నెతెచ్చేయి. మరి ఆయిదునెలలకి సీతమ్మ కొడుకును కంది. వీరభద్ర రావుకు మోడువారిన మనస్సు పుష్పించినట్లయింది. అతనికి పిల్లడిమీద ప్రేమ అధికమయింది. అస్తమానం ఆ పిల్లడి నలా చేతులలో రెత్తుకొని కచేరీ పనికూడ మరచిపోయేవాడు.

ఒకనాడాతనికి ఉగ్గుగిన్నె జ్ఞాపకం వచ్చింది. వెంటనే బజారుకువెళ్లి ఒక వెండిఉగ్గుగిన్నె పట్టుకొని వచ్చేడు. "జానకీ! ఇదిగో! చూ"డన్నాడు.

సీతమ్మ త్రుళ్ళిపడి వెళ్ళి ఆ చేతిలో ఉగ్గుగిన్నె అందుకుంది.

సీతమ్మ:—దీనిముందు గాజాలెందుకూ? గడియారం గొలుసెందుకూ?

"జానకీ!" యని ఆ బాలెంతరాలి పసుపుబుగ్గలు వీరభద్రరావు ముద్దుపెట్టుకున్నాడు.